నమస్తే తెలంగాణ

మెదక్

I | హైదరాబాద్, సోమవారం 12 ఆగస్టు 2024 | MEDAK




సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్‌లోకి వస్తున్న గోదావరి జలాలను చూస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

## నీటి విడుదలకు ప్రణాళికలు సిద్ధంచేయాలి

- రంగనాయక సాగర్‌లో 3 టీఎంసీలు నింపాలి
- కాలువల్లో పిచ్చిమొక్కలు, గడ్డిని తొలిగించాలి
- రైతులకు నీరు విడుదల చేయాలి
- ఇరిగేషన్ అధికారులను కోరిన మాజీ మంత్రి,
- సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట,ఆగస్టు11: రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కాలువల ద్వారా నీటిని విడుదల చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించాలని మాజీ మంత్రి , సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అధికారులను కోరారు. ఆదివారం నీటిపారుదల శాఖ ఎస్ఈ బస్వరాజ్, ఈఈ గోపాలకృష్ణతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. రంగనాయక సాగర్‌లో ప్రస్తుతం 2.8 టీఎంసీల నీరు ఉందని, ప్రాజెక్టు పూర్తిసామర్థ్యం మేర 3 టీఎంసీలు నీటిని నింపాలన్నారు.రిజర్వాయర్ల నుంచి కాలువల్లోకి నీటిని విడుదల చేసేందుకు ముందు కాలువల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, గడ్డిని తొలిగించాలని కోరారు.

**రంగనాయక సాగర్‌ను సందర్శించిన హరీశ్‌రావు**

ఆదివారం రంగనాయక సాగర్‌ను హరీశ్‌రావు సందర్శించారు. మిడ్‌మానేరు నుంచి రంగనాయక సాగర్‌లోకి వస్తున్న గోదావరి జల సవ్వడులను చూసి సంతోషం వ్యక్తం చేశారు. రైతులకు నీరు అందించాలనే నిత్య తపనకు ఈ గోదావరి జలాలే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.సిద్దిపేట నియోజకవర్గ రైతులకు గొప్ప వరం రంగనాయక సాగర్ అన్నారు.


## అన్నిరంగాల్లో సిద్దిపేట అభివృద్ధి



సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న తన్నీరు హరీశ్‌రావు

- అన్నివేళ లా మీకు అండగా ఉంటా
- గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపుతాం..
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఆగస్టు 11 : తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ సహకారంతో సిద్దిపేట ప్రాంతాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసుకున్నామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో 229 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్నివేళలా మీకు అండగా ఉంటానన్నారు. ఆరు గ్యారంటీలు, అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అన్నివర్గాలను మోసం చేస్తున్నదన్నారు. కాంగ్రెస్ స్కీమ్‌లు సరిగ్గా అమలు కావడం లేదన్నారు. అధికారంలోకి రాగానే కాంగ్రెస్ రైతుబంధు ఇవ్వడం లేదన్నారు.త్వరలోనే సిద్దిపేట నియోజకవర్గంలోని ప్రతి చెరువు, కుంటను గోదావరి జలాలతో నింపుతామన్నారు. కేసీఆర్ సహకారంతో సిద్దిపేటకు గోదావరి జలాలు, రైలు తెచ్చామని, జిల్లా ఏర్పాటు చేసుకున్నట్లు గుర్తుచేశారు. నేడు సిద్దిపేట అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందని,విద్యాలయాలు,రహదారులు, దవాఖానలు, అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, నాయకులు జాప శ్రీకాంత్‌రెడ్డి, మారెడ్డి రవీందర్ రెడ్డి, కడవేర్గు రాజనర్సు, ముల్కల కనుకరాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న హరీశ్‌రావు



సంగారెడ్డి జిల్లా సింగూరు ప్రాజెక్టులో నీళ్లు లేక ఎండిపోయిన కాల్వ

# కలిసి రాని కాలం..!



సంగారెడ్డి జిల్లా సింగూరు ప్రాజెక్టులో నీళ్లు లేక ఎండిపోతున్న కాల్వ

- తగ్గిన వానకాలం పంటల సాగు
- సంగారెడ్డి జిల్లాలో 5.67 లక్షల ఎకరాలకే పరిమితం
- గతేడాది 7.19 లక్షల ఎకరాల్లో సాగు
- వర్షాభావం, రైతుబంధు నిలిపివేత ఎఫెక్ట్
- వ్యవసాయశాఖ అంచనాలు తారుమారు
- సింగూరు ఆయకట్టులో తగ్గిన వరి సాగు

సంగారెడ్డి, ఆగస్టు 11(నమస్తే తెలంగాణ) : సంగారెడ్డి జిల్లా రైతులకు ఈ వానకాలం కలిసి రావడం లేదు. జిల్లాలో సీజన్ ఆరంభంలో వర్షాలు మురిపించి ఆ తర్వాత క్రమంగా ముఖం చాటేశాయి. దీంతో పంటల సాగు విస్తీర్ణం లక్ష ఎకరాల వరకు తగ్గింది. ఇటీవల తుఫాను ప్రభావంతో వర్షాలు కురిసినప్పటికీ ఆశించిన స్థాయిలో సాగు విస్తీర్ణం పెరగలేదు. గత వానకాలం సంగారెడ్డి జిల్లాలో 7,19,525 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఈసారి ఇప్పటి వరకు 5,67,559 ఎకరాల్లో మాత్రమే రైతులు పంటలు వేశారు. వరి సాగు విస్తీర్ణం పెరిగినప్పటికీ జిల్లాలో అన్ని పంటల సాగు విస్తీర్ణం కేవలం 6 లక్షల ఎకరాలకు మాత్రమే పరిమితమయ్యే పరిస్థితి ఉంది.గత వానకాలంలో 7.19 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. వర్షాభావం, రైతుబంధు ఇవ్వకపోవడం, సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేకపోవడం, కరెంటు కోతలు, ప్రాజెక్టులు, చెరువుల్లో నీరు లేకపోవడం వంటి కారణాలతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. కరెంటు కోతల కారణంగా రైతులు బోరుబావుల కింద చెరుకు, వరి, కూరగాయల సాగు తగ్గించారు. సింగూరు ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయకపోవడంతో కాల్వల కింద రైతులు ఆశించిన స్థాయిలో వరి సాగుచేయలేదు.

**పత్తి, కంది సాగు తగ్గుముఖం**

వ్యవసాయశాఖ అంచనాలకు అనుగుణంగా వానకాలం సాగు జిల్లాలో జరగలేదు. ప్రస్తుత సీజన్‌లో సంగారెడ్డి జిల్లాలో 7,22,920 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. వర్షాభావం ఎఫెక్ట్ ఎక్కువగా ఉండడంతో 5,67,559 ఎకరాల్లోనే రైతులు పంటలు వేశారు. వరినాట్లకు మినహా మిగతా పంటల సాగుకు సమయం మించిపోయింది. దీంతో జిల్లాలో ఈ సీజన్‌లో 6.50 లక్షల ఎకరాలకు సాగు పరిమితమయ్యే అవకాశాలు ఉన్నాయి. వానకాలం సీజన్‌లో ప్రధానంగా పత్తి, కంది, చెరుకు ఎక్కువగా సాగుచేస్తారు. ప్రస్తుతం ఈ సీజన్‌లో ఈ పంటల సాగు ఆశించిన స్థాయిలో జరగలేదు. సంగారెడ్డి, అందోలు, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో ఎక్కువగా పత్తి సాగు అవుతున్నది. 3.60 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని వ్యవసాయశాఖ అంచనా వేయగా, 3.35 లక్షల ఎకరాలకు పరిమితమైంది. 79,500 ఎకరాల్లో కంది సాగు అవుతుందని అంచనా వేయగా, 68వేల ఎకరాల్లో వేశారు. మిగతా పంటలు సైతం ఆశించిన స్థాయిలో వేయలేదు. 1.50 లక్షల ఎకరాల్లో వరి సాగు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం 36,705 ఎకరాల్లో మాత్రమే సాగైంది. 14,200 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేస్తారని అంచనా వేయగా, 8544 ఎకరాలకే పరిమితమైంది. 77,600 ఎకరాల్లో సోయా సాగు కావాల్సి ఉండగా, 66,375 ఎకరాల్లో ఈ పంట వేశారు. 25వేల ఎకరాల్లో చెరుకు సాగు కావాల్సి ఉండగా, 14,572 ఎకరాల్లో పంట వేశారు. జిల్లాలో ప్రధాన పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గత సీజన్‌తో పోలిస్తే పెసర, మినుము పంటల సాగు స్వల్పంగా పెరిగింది.

**రైతు బంధు నిలిపివేతతో ప్రభావం**

వర్షాభావానికి తోడు ప్రధానంగా రైతుబంధు పథకం నిలిపివేయడం వానకాలం పంటల సాగుపై ప్రభావాన్ని చూపింది. కేసీఆర్ సర్కార్ ఏటా వానకాలం, యాసంగి సీజన్‌లో రైతులకు ముందస్తుగానే రైతుబంధు కింద పెట్టుబడి సాయం అందజేసేది. జిల్లాలోని ప్రతిరైతుకు ఎకరాకు రూ.5వేల చొప్పున రైతుబంధు డబ్బులు ఖాతాల్లో వేసేది. జిల్లాలో 2018 నుంచి 2023-24 వరకు 12 విడతల్లో 3,28,996 మంది రైతులకు కేసీఆర్ సర్కార్ రూ.4059 కోట్లు పెట్టుబడి సాయంగా అందజేసింది. గతేడాది వానకాలం సీజన్‌లో 3,59, 010 మంది రైతులకు రూ.375 కోట్లు రైతుబంధు అందజేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు(రైతుభరో సా) ఇవ్వకపోవడంతో చాలామంది రైతులు పెట్టుబడి లేక సాగుకు వెనకడుగు వేయడంతో పంటల విస్తీర్ణం తగ్గింది.



సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టులో నీళ్లు లేక రాళ్లు తేలిన దృశ్యం

## అధ్వానంగా ఎల్కల్ -మక్తామాసాన్‌పల్లి రోడ్డు



గుంతలమయంగా సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం ఎల్కల్ నుంచి మక్తామాసాన్‌పల్లికి వెళ్లే రోడ్డు

రాయపోల్, ఆగస్టు 11 : సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని ఎల్కల్ నుంచి మక్తామాసాన్‌పల్లికి వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. చిన్నపాటి వర్షానికే రోడ్డు చిత్తడిగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. 20 ఏండ్ల నుంచి రోడ్డుకు మరమ్మతులు చేయక ప్రయాణికులు,గ్రామస్తులు పడరాని పాట్లు పడుతున్నారు. అడుగడుగునా గుంతలు పడటంతో ఎల్కల్ నుంచి గజ్వేల్‌కు వెళ్లాలంటే ప్రయాణికులు,గ్రామస్తులు అనేక అవస్థలు పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని గతంలో జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఆయా పార్టీల నాయకులు హామీలు ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. ఎల్కల్ గ్రామం నుంచి మక్తమాన్‌పల్లి వరకు నిత్యం కాలినడకన వెళ్లి అక్కడి నుంచి బస్సులో పోవాల్సిన పరిస్థితి నెలకొన్నదని అధికారులు, ప్రజాప్రతినిధులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రోడ్డుకు మరమ్మతులు చేయించాలి**



ఎల్కల్ నుంచి మక్తామాసాన్ పల్లికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. కొన్నేండ్ల నుంచి రోడ్డు సరిగ్గా లేక ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు గుంతలమయంగా మారడంతో బస్సులు రావడం లేదు. కాలినడకన లేదా ఆటోల్లో ఇతర గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోడ్ల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అధికారులు.ప్రజా ప్రతినిధులు రోడ్డుకు మరమ్మతులు చేయించాలి.

**-జాల రవీందర్, ఎల్కల్ గ్రామం, రాయపోల్ మండలం, సిద్దిపేట జిల్లా**

## ఏడుపాయల్లో భక్తజన జాతర



ఆదివారం ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం ఎదుట భక్తుల సందడి



పూజలు అందుకుంటున్న వనదుర్గమ్మ

పాపన్నపేట్, ఆగస్టు 11: రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో ఒకటైన ఏడుపాయల వనదుర్గమ్మను ఆదివారం భారీగా భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులు మంజీరా నదిలోని పాయల్లో పుణ్యస్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఒడిబియ్యం, కుంకుమార్చనలు ,తలానీలాలు,బోనాలు సమర్పించి మొక్కుకున్నారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, సిబ్బంది , రవివీర్‌కుమార్, సూర్యశ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, తోట నర్సింలు,వరుణాచారి, రాజు, శ్రీకాంత సేవలందించారు. వేద పండితులు శంకరశర్మ, పార్థివశర్మ,మురళీధర్,రాజశేఖర్ పూజలు నిర్వహించారు. పాపన్నపేట్ ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ సిబ్బందితో కలిసి బందోబస్తు విధులు చేపట్టారు.

# తాగునీటికి తండ్లాట..!



సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్‌లో నీటి సంపు, (ఇన్‌సెట్‌లో) ఇంటిబోర్లలో వస్తున్న కలుషిత జలాలు

- ముత్తంగి, చిట్కుల్, ఇస్నాపూర్‌లో తీవ్ర నీటి ఎద్దడి
- మరమ్మతుల పేరున చేతులెత్తేస్తున్న మిషన్ భగీరథ అధికారులు
- కాలనీలకు నెలకు 5 రోజులే నీటి సరఫరా
- వర్షాకాలంలోనే ఇంతటి ఇబ్బందులు
- ముందుముందు ఎలా ఉంటుందోనని ప్రజల ఆందోళన
- 95 వేల జనాభాపై ప్రభావం

పటాన్‌చెరు, ఆగస్టు 11: సంగారెడ్డి జిల్లా ముత్తంగి, ఇస్నాపూర్, చిట్కుల్ గ్రామాల్లో తాగునీరు రాక ప్రజలు పరేషాన్ అవుతున్నారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామానికి వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడంలేదు. ఇస్నాపూర్‌లోను వారం తర్వాత ఆదివారం తాగునీరు ప్రజలకు వదిలారు. చిట్కుల్ గ్రామంలో వారానికి ఒకరోజు మాత్రమే తాగునీరు ఇస్తున్నారు. ఇస్నాపూర్‌లో 45 వేల జనాభా, ముత్తంగిలో 25వేల జనాభా, చిట్కుల్‌లో 25వేల జనాభా నివసిస్తున్నారు. దాదాపు 95వేల మందికి తాగునీరు అందట్లేదు. మిషన్ భగీరథ గ్రిడ్ వైఫల్యంతో తాగునీరు ప్రజలకు వదలడం లేదు. భూగర్భజలాలు కలుషితం కావడంతో ఇక్కడి బోరు నీటి వాడకం ప్రమాదకరం. మిషన్ భగీరథ నల్లాల్లోంచి చుక్కనీరు రాకపోవడంతో బోరు నీటినే ప్రజలు ఉపయో గిస్తున్నారు. రసాయన పరిశ్రమల వ్యర్థాలు, ఫార్మా పరిశ్రమల కాలుష్య జలాలు భూగర్భ జలాల్లో కలిశా యి. మూడు దశాబ్దాలుగా ఇక్కడి భూగర్భ జలాలు వివిధ రంగుల్లో, దుర్వాసనతో వస్తున్నాయి. ఈ విష యంలో పర్యావరణవేత్తలు సుప్రీంకోర్టుకు, చెన్నైలోని గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్లి ఉచిత తాగునీరు అందజేసేలా ఆర్డర్ తెచ్చుకున్నారు. కాలుష్య పీడిత గ్రామాలుగా గ్రీన్ ట్రిబ్యునల్ గుర్తించిన ఇస్నాపూర్, ముత్తంగి, చిట్కుల్‌కు తాగునీరు అందజేయడంలో జిల్లా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. క్యాసారం నుంచి వచ్చే మెయిన్ లైన్, సంగారెడ్డి వైపు నుంచి వచ్చే లైన్లు ఎప్పుడు మరమ్మతుల్లో ఉన్నాయనే సాకు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. మిషన్ భగీరథ ద్వారా పలు కాలనీలకు నెలకు 5 రోజులకు మించి తాగునీరు అందట్లేదు. ఇక్కడ ఎక్కువశాతం సెటిలర్లు, కార్మికులు ఉండటంతో వారి నీటి అవస్థలు బయటకు రావడం లేదు. వర్షాకాలంలోనే పరిస్థితి ఇలా ఉంటే వేసవిలో ఎలా ఉంటుందో ఊహించుకుని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామసభల్లో ప్రజలు తాగునీటి కోసం అధికారులను నిలదీస్తున్నారు.

**రోగాలు ఖాయం...**

ముత్తంగి, చిట్కుల్, ఇస్నాపూర్ గ్రామాల్లో భూగర్భ జలాల్లో యాంటీబయోటిక్స్ కలిశాయని స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ సంస్థలు ఆరోపిస్తున్నాయి. ఈ కలుషిత నీటిని సేవిస్తే రోగాలు రావడం ఖాయమంటున్నారు. ఇప్పటికే ప్రతి ఇంటా దీర్ఘకాలిక రోగులు కనిపిస్తున్నారు. రోజుకు దాదాపు కోటి లీటర్ల నీరు ఈ ప్రాంతానికి అందజేయాలి. కానీ, వారానికి కోటి లీటర్లు కూడా ఇవ్వడం లేదు. మిషన్ భగీరథ పథకం ద్వారా పంపిణీ చేస్తున్న నీరు సంపుల్లోకి వదులుతున్నారు. మిషన్ భగీరథ గ్రావిటీ ద్వారా పంపిణీ చేసే పథకం. కానీ, ఇస్నాపూర్, ముత్తంగి, చిట్కుల్‌లో గ్రావిటీ పనిచేయడం లేదు. మోటర్ల ద్వారా సంపుల్లో ఈ నీటిని నింపుతున్నారు. అక్కడి నుంచి ట్యాంకులకు మోటార్లతో ఎక్కిస్తున్నారు. ఈ గ్రామాలకు పదుల సంఖ్యలో కాలనీలు రావడంతో ఈ కాలనీలకు తాగునీరు అందజేయడం పంచాయతీలకు తలకుమించిన భారంలా మారింది. పైనుంచి నీరు రావడం లేదని పంచాయతీ సిబ్బంది చెతులెత్తేస్తున్నారు. మిషన్ భగీరథ గ్రిడ్ నీటి పంపిణీలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. చిట్కుల్ గ్రామానికి నీటిని వదిలితే ఇస్నాపూర్‌లో నీటిని నిలుపుతున్నారు. ఆ తర్వాత ముత్తంగికి ఇస్తున్నారు. వారంలో రెండు, మూడు రోజులు ఇస్తున్న నీరు సంబంధిత గ్రామాల్లో సగం కాలనీలకు కూడా సరిపోవడం లేదు. నిత్యం నీటిని ఇస్తేనే అన్ని కాలనీలకు నీరు అందుతుంది. ఎప్పుడు చూసినా మిషన్ భగీరథ అధికారులు కంది వద్ద పైప్‌లైన్ పగిలిందని చెబుతూ వారం రోజులకు పైనే నీటిని నిలిపేస్తున్నారు. అందులో శనివారం, ఆదివారం రోజు వస్తే అధికారుల ఫోన్లు మూగబోతున్నాయి. మొత్తంగా నెలకు 5-6 రోజులే తాగునీరు ప్రజలకు అందుతుండడం దారుణం. దిక్కులేక ప్రజలు కాలుష్య భూగర్భ జలాలే వాడుతున్నారు. ఆర్వో ప్లాంట్ల నుంచి తాగునీరు కొనుక్కుంటున్నారు. అందరి ఆరోగ్యాలను కాపాడేందుకు తెచ్చిన మిషన్ భగీరథ పథకం ఇప్పుడు ప్రజల ఆరోగ్యాలకు శాపంగా మారుతున్నది.



సంగారెడ్డి జిల్లా చిట్కుల్‌లో సంపు, నీటి ట్యాంక్

## కొమురెల్లి మల్లన్నకు కోటిదండాలు

- 'మల్లన్న' క్షేత్రంలో భక్తుల రద్దీ
- ప్రసాదాల కౌంటర్ల వద్ద భక్తుల ఇక్కట్లు



మల్లన్న ఆలయంలో అర్చకుల పూజలు

చేర్యాల, ఆగస్టు 11 : సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అభిషేకాలు, పట్నాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. ఒడిబియ్యం పోయడం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు నిత్య కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకుని బోనాలు సమర్పించారు. రాతిగీరలు వద్ద ప్రదక్షిణలు, కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు చేశారు. ఆలయ ఈవో ఎ.బాలాజీ, ఏఈవో బుద్ది శ్రీనివాస్, సూపరింటెండెంట్లు సురేందర్, శ్రీరాములు, సిబ్బంది, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఒగ్గు పూజారులు, అర్చకులు భక్తులకు సేవలందించారు.

**ప్రసాదం కౌంటర్ల వద్ద ఇబ్బందులు ...**

నూతనంగా నిర్మించిన ప్రసాదాల టికెట్లు, లడ్డూ, పులిహోర విక్రయ కౌంటర్ల వద్ద భక్తులు ఎక్కువ సమయం క్యూలో ఉండాల్సి వస్తున్నది. ప్రతి ఆదివారం,బుధవారాలతో పాటు ప్రత్యేక రోజులు, పర్వదినాల్లో భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు.స్వామివారి దర్శనం అనంతరం భక్తులు ప్రసాదాలు కొనుగోలుకు కౌంటర్ల వద్దకు వెళ్లి గంటల పాటు టికెట్లు కొనుగోలు చేసి ప్రసాదాలు తీసుకునేంత వరకు వేచి ఉండాల్సి వస్తున్నది. కౌంటర్ల ముందు నీడ కోసం ఎలాంటి నిర్మాణాలు చేపట్టక పోవడంతో ఎండకు, వానకు భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఆలయం వద్ద ప్రసాదాల కౌంటర్ల ముందు ఎండలో క్యూలో భక్తులు